సాక్షి అనంతపురం

ఆదివారం । 19 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి. మార్కెట్‌కు 4 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 35.2°/20.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రిజెక్ట్ ఈవీఎంలు వెనక్కు



గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ)లో రిజెక్ట్ అయిన ఈవీఎంలను వెనక్కు పంపిస్తామని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. శనివారం నగరంలోని పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎల్‌సీలో 89 బ్యాలెట్ యూనిట్లు, 82 కంట్రోల్ యూనిట్లు, 218 వీవీ ప్యాట్‌లు రిజెక్ట్ అయ్యాయన్నారు. వీటిని స్కాన్ చేసి పోలీసు బందోబస్తుతో బెల్ కంపెనీకి పంపిస్తామన్నారు. ఈవీఎంల భద్రతపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోడౌన్ వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు నిరంతరం పనిచేస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, తహసీల్దార్ బాలకిషన్, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం రూరల్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయ చేతి వృత్తి కార్మికులకు, హస్తకళల నిపుణులైన స్వర్ణకారులు, కార్పెంటర్లు (వడ్రంగి), శిల్పకారులు, కొలిమి (బ్లాక్ స్మిత్), బుట్టలు, చాపలు, పరకలు అల్లేవారు (మాట్స్), చెప్పులు కుట్టేవారు, దోబీ (చాకలి), కుమ్మరి, టైలర్లు, తాపీ కార్మికులు, బార్బర్, రాళ్లు కొట్టువారు, బొమ్మలు, పూల దండలు, తాళాల తయారీదారులకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రూ. లక్ష నుంచి రూ. మూడు లక్షల వరకు 5 శాతం వడ్డీతో (తిరిగి చెల్లించే పద్ధతి) బ్యాంకుల ద్వారా రుణసహాయం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. దరఖాస్తు చేసుకునే వారి వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. ఐదేళ్లలోపు పీఎంఈజీపీ, పీఎం ముద్ర వంటి రుణాలను పొంది తిరిగి చెల్లించని వారు అనర్హులన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందని, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటే వర్తించదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు www.pmvishwakarma.gov.in లేదా కామన్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్‌సీ) ఇతర సమాచారం కోసం మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

24న 'డాక్ అదాలత్'

అనంతపురం సిటీ: తపాలా శాఖ అనంతపురం డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ పీఆర్‌ఓ ప్రమోద్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తపాలా శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలు వివరిస్తూ లిఖిత పూర్వకంగా పోస్టల్ ఎన్వలప్ కవర్ ద్వారా 24వ తేదీ లోపు అనంతపురంలోని డివిజనల్ కార్యాలయానికి అందేలా పంపాలి. ఫిర్యాదులపై 24న ఉదయం 11 గంటల నుంచి వాటిని తపాలా ఎస్పీ పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

'పర్తి'పురి.. భక్తఝురి



వేణుగోపాల రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రత్నాకర్ రాజు



సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



పుట్టపర్తిలో వేణుగోపాలస్వామి రథోత్సవం

- సత్యసాయి 98వ జయంత్యుత్సవాలు ప్రారంభం
- దేశవిదేశాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- కనులపండువగా వేణుగోపాల స్వామి రథోత్సవం
- మార్మోగిన సాయి నామస్మరణ

ప్రశాంతి నిలయం: మది మురిసింది. ఆధ్యాత్మిక తరంగమైంది. భక్తిభావం వెల్లివిరిసింది. సాయి నామస్మరణ మార్మోగింది. సత్యసాయి 98వ జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన అశేష భక్తులతో పుట్టపర్తి జనసంద్రమైంది.

అంగరంగ వైభవం.. రథోత్సవం

ఉత్సవాల్లో మొదటి రోజు వేణుగోపాల స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేద పఠనం అనంతరం ఉత్సవమూర్తులు సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడికి, మూలవిరాట్టు వేణుగోపాల స్వామి విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేద పండితుడు నారాయణ నేతృత్వంలో ప్రత్యేక ఫల, పుష్ప దళాలతో సుందరంగా తీర్చిదిద్దిన పల్లకీలో విగ్రహాలను కొలువుదీర్చి ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు స్వయంగా పల్లకీ మోశారు. అనంతరం మూలవిరాట్టును రథంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవాన్ని ప్రారంభించారు.



పూజలందుకున్న ఉత్సవమూర్తులు

గోపాలుడిని స్మరిస్తూ రథాన్ని లాగుతూ భక్తులు పారవశ్యం పొందారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వేణుగోపాలునిపై పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సాయినామ స్మరణతో పుట్టపర్తి మార్మోగింది. పెద్ద వెంకమరాజు కల్యాణ మండపం వద్ద రత్నాకర్ రాజు దంపతులు మంగళహారతినిచ్చి రథోత్సవానికి ముగింపు పలికారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి సేవా సంస్థల నేషనల్ కోఆర్డినేటర్ కోటేశ్వర రావు, సేవా దళ్ అధ్యక్షులు లక్ష్మణ్ రావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకారులు..

రథోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సత్యసాయి భక్తులు, బాలవికాస్ చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో మురిపించారు. చిన్ని కృష్ణుడు, గోపిక, సీతా రామలక్ష్మణ, భరత, శత్రుఘ్న తదితర దేవతామూర్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు.పలు రాష్ట్రాల భక్తులు తమ సాంస్కృతిక, సంప్రదాయాలు ప్రదర్శిస్తూ అలరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతాలు..

సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత సామూహిక సత్యనారాయణ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేశ విదేశాలకు చెందిన 2 వేల మంది దంపతులు నిష్టతో వ్రతాలు ఆచరించారు.

మహా నారాయణ సేవ, మెడికల్ క్యాంప్ ప్రారంభం

వేడుకలను పురస్కరించుకుని నార్త్ బిల్డింగ్స్ వద్ద ఏర్పాటు చేసిన మహా నారాయణ సేవ (అన్నదానం), ప్రత్యేక వైద్య శిబిరాన్ని సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు ప్రారంభించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన డాక్టర్ రామ్ మనోహర్, డాక్టర్ గీతా కామత్‌ల నేతృత్వంలో ఈ నెల 24 వరకూ మెడికల్ క్యాంప్ సాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. చెవి, ముక్కు, నోరు, గుండె, చర్మం, చిన్నపిల్లలు, గైనిక్, ఎముకలు, ఊపిరితిత్తులు, మానసిక వ్యాధులకు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు.



గిరగ నృత్యం చేస్తున్న కళాకారులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సత్యసాయి ఆశయ సాధనకు కృషి

మానవతా విలువలు బోధిస్తూ సమస్త ప్రపంచాన్ని సేవా మార్గం వైపు నడిపిన మహనీయుడు సత్యసాయి. ఆయన ఆశయ సాధనకు మనస్ఫూర్తిగా కృషి చేస్తున్నా. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ పుట్టపర్తి కేంద్రంగా ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో పుట్టపర్తికి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత వన్నె తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. దేశ విదేశాల నుంచి తరలి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఎన్‌హెచ్ 342, 716జీ, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు ఏర్పాటవుతుండడం శుభపరిణామం.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే

భక్తుల కోసం ఘనంగా ఏర్పాట్లు



సత్యసాయి సేవలు వెలకట్టలేనివి. ఆయన ప్రారంభించిన సేవా కార్యక్రమాలను మరింత నాణ్యతగా అందించేందుకు కృషి చేస్తున్నాం. జయంతి వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఘనంగా ఏర్పాట్లు చేశాం. ప్రతి సాయి భక్తుడు వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నా.

– ఆర్.జె.రత్నాకర్ రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

ఉరిమే ఉత్కంఠ

నేడు క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్

- ఆస్ట్రేలియాతో టీమిండియా అమీతుమీ
- ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే ఫీవర్
- మ్యాచ్ వీక్షణకు పలుచోట్ల ప్రత్యేక ఏర్పాట్లు
- అనంతపురం పీటీసీలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: క్రికెట్ ఫీవర్ అమాంతంగా హీటెక్కింది. క్రికెట్ వరల్డ్ కప్‌లో ఫైనల్ మ్యాచ్ ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. అప్రతిహత విజయాలతో ఎదురులేని టీమిండియా పటిష్ట ఆస్ట్రేలియా జట్టుతో ఫైనల్‌లో తలపడుతోంది. ఈ మ్యాచ్ గురించే ఇప్పుడు కోట్లాది మంది చర్చించుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఈ హీట్ మే మాసంలో తారెత్తించే ఎండలను తలపిస్తోంది. బార్బర్ షాపులు, టీస్టాళ్లు, హోటళ్లు, దాబాలు, బట్టల షాపులు, పాన్ షాపులు ఇలా ఎక్కడ చూసినా ఫైనల్ మ్యాచ్‌పైనే చర్చలు. 2011లో ప్రపంచకప్ గెల్చుకున్న తర్వాత భారత్ ఫైనల్‌కు రావడం ఇదే తొలిసారి. పన్నెండేళ్ల తర్వాత ఫైనల్‌కు వచ్చిన టీమిండియా విజయం సాధించాలని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్‌లు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేటి మ్యాచ్ వీక్షణకు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, తాడిపత్రి ఇలా ప్రతి చోటా పెద్ద పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లు సిద్ధం చేసుకున్నారు. అనంతపురంలో పీటీసీ (పోలీస్ ట్రైనింగ్ సెంటర్)లో భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. బార్‌లు, హోటళ్లు, దాబాల్లో శనివారం రాత్రికే స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లలో మ్యాచ్ చూసుకునేందుకు కావలసినంత డేటా రీచార్జ్ చేసుకున్నారు.

భారత్ విజయంపై భారీ అంచనాలు..


ఈ వరల్డ్ కప్‌లో భారత్ అప్రతిహత విజయాలతో దూసుకెళుతోంది. లీగ్‌మ్యాచ్‌లలో 9, సెమీ ఫైనల్ మొత్తం 10 మ్యాచుల్లోనూ నెగ్గి తన ఫామ్‌ను కొనసాగిస్తున్న టీమిండియాపై అభిమానులు అచంచల విశ్వాసంతో ఉన్నారు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్ భాగస్వామ్యంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పవర్ ప్లేలో 90 పరుగుల భాగస్వామ్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. కోహ్లి, శ్రేయస్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, సూర్యకుమార్ యాదవ్‌ల మిడిలార్డర్ బ్యాటింగ్ విజయానికి దోహదపడుతుందని తాడిపత్రికి చెందిన ఓ యువకుడు జోస్యం చెప్పారు. షమీ ప్రతిభ వేనోళ్ల కొనియాడుతుండగా..సిరాజ్, బుమ్రా లాంటి సీమర్లు మ్యాచ్‌ను శాసించగలరని ధర్మవరం చెందిన మరో పెద్దాయన విశ్లేషించారు.

కర్ఫ్యూను తలపించనున్న రోడ్లు..


నాలుగు రోజుల కిందట న్యూజిలాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలోనే రోడ్లు కర్ఫ్యూను తలపించాయని, సెలవు రోజైన ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌కు ఎవ్వరూ బయటకు రారని అనంతపురానికి చెందిన ఓ షాపు నిర్వాహకుడు చెప్పారు. మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుండగా ఒంటిగంట నుంచే టీవీలకు అతుక్కుపోయే అవకాశం ఉంది. అందరూ ఒకే చోట చేరి మ్యాచ్‌ను తిలకిస్తే ఆ కిక్కే వేరని చాలామంది మిత్రులు ఒక ఇంట్లో మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. 20 మంది దాటితే ఏకంగా క్యాటరింగ్ భోజనాలకు ఆర్డర్ పెట్టినట్టు తెలిసింది. ఇక మందుబాబుల ఏర్పాట్లు ఎలాగూ ఉండనే ఉన్నాయి.

బెట్టింగ్ బాబుల స్టైలే వేరు..

ఫైనల్ మ్యాచ్ అంటే ఆషామాషీ కాదు. ఈ మ్యాచ్‌పై బెట్టింగ్ ఓ రేంజ్‌లో జరగనుంది. పోలీసులు ఎంత నిఘా వేసినా వారి కళ్లుగప్పి రూ.కోట్లలో పందెం నిర్వహిస్తున్నారు. ఇండియా–ఆస్ట్రేలియా గెలుపుపై 80:20 నడుస్తోంది. అంటే ఇండియా గెలిస్తే 20 రూపాయలు, ఆస్ట్రేలియా గెలిస్తే 80 రూపాయలు ఉంది. అంటే ఇండియాపై ఎంత నమ్మకమో అంచనా వేయొచ్చు. మ్యాచ్ విజయంపై పందెమే కాదు.. ఓవర్‌లో ఎన్ని పరుగులు, ఎన్ని ఫోర్లు, ఎన్ని సిక్స్‌లు, ఏ ప్లేయర్ ఎన్ని పరుగులు, ఎన్ని ఓవర్లలో ఆలౌట్, పవర్‌ప్లేలో ఎన్ని పరుగులు అనే దానిపైనా పందేలు ఆడుతున్నారు. నేటి మ్యాచ్‌పై రూ.కోట్లలోనే పందెం జరగనున్నట్టు తెలుస్తోంది.



ఇండియా విజయం సాధిస్తుంది



వరల్డ్ కప్ ప్రారంభం నుంచి ఇండియా జట్టు సభ్యులు స్పోర్టివ్ గేమ్ ఆడుతున్నారు. ముఖ్యంగా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్, షమీ, సిరాజ్ మంచి ఫాంలో ఉన్నారు. హోం గ్రౌండ్ కావడం, క్రీడాకారులు ఫాంలో ఉండడం ఇండియా జట్టుకు కలిసొచ్చే అంశం. ఆస్ట్రేలియా జట్టు మంచి పోటీ ఇస్తుంది. మ్యాచ్ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇండియా జట్టు తప్పక విజయం సాధిస్తుంది.

– పద్మావతి, అనంతపురం

లింగ నిర్ధారణ తీవ్ర నేరం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి,అధికారులు

అనంతపురం అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్రమైన నేరమని కలెక్టర్ గౌతమి అన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాల్యవివాహాల దుష్ప్రభావాల గురించి పాఠశాలల్లో బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై జిల్లాస్థాయి జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తున్నట్లు గుర్తిస్తే తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అదే క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 9 నుంచి ఇప్పటి వరకు వచ్చిన క్లినిక్‌లు, ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, రెవెన్యూవల్‌కు సంబంధించి తనిఖీలు మరోమారు నిర్వహించి నివేదిక ఇవ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలు నిర్వహిస్తుంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం, బాల్యవివాహాలపై విద్య, వైద్యారోగ్య, స్త్రీశిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సేవ్ గర్ల్ చైల్డ్‌పై దిగువస్థాయిలో అవగాహన తీసుకురావాలన్నారు. పాఠశాలల్లో గర్ల్ చైల్డ్ గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. రాయదుర్గం రూరల్, గుంతకల్లు రూరల్, శెట్టూరు తదితర మండలాల్లో బాలికల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. మండల స్థాయిలో లింగ నిష్పత్తి సమాన స్థాయిలోకి వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమగ్ర బాలల పరిరక్షణ పథకం పోస్టర్లను కలెక్టర్, అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి టి.హరిత, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో- ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, డీఐఓ యుగంధర్, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఈఓ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణంలో వేగం పెరగాలి

అనంతపురం అర్బన్: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఆప్షన్–3 కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో వేగం పెరగాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స హాల్‌లో హౌసింగ్ పీడీ నరసింహారెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆప్షన్–3 కింద 13,884 ఇళ్ల నిర్మాణం చేపట్టగా, ఇందులో పునాది స్థాయిలో 6,180, రూఫ్ లెవల్‌లో 1,507, స్లాబ్ దశలో 1,108 ఇళ్లు, మిగతావి వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. కూలీల సంఖ్య పెంచి ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని ఆదేశించారు. పునాది స్థాయిలో ఉన్న ఇళ్లన్నీ డిసెంబరు 15లోగా ఆర్‌సీ స్థాయిలోకి తీసుకురావాలన్నారు. తాడిపత్రి నియోజకవర్గం సజ్జలదిన్నె లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పూర్తికి బాగా పనిచేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో జింక మృతి



బ్రహ్మసముద్రం: చిరుత దాడిలో ఓ కృష్ణ జింక మృతి చెందింది. బ్రహ్మసముద్రం మండలం రాయలదొడ్డి పంచాయతీ కొత్తిండ్లు సమీపంలోని ఓ మామిడి తోటలో శనివారం ఉదయం జింక కళేబరాన్ని రైతులు గుర్తించి సమాచారం అందించడంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చిరుత పాద ముద్రలను గుర్తించారు. జింక కళేబరానికి పశు వైద్యాధికారులతో పోస్టుమార్టం చేయించి, అక్కడకే దహనం చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ షనవాజ్, బీట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం బ్రాంచ్–2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న టీజీ రెడ్డిని తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్‌గా, రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్‌ను అనంతపురం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 గా, ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న శివను కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ శాఖ డీఐజీ మాధవి తెలిపారు.

సూక్ష్మ సేద్యంలో అనంత అగ్రస్థానం

- ఈ ఏడాది 12,500 హెక్టార్లు లక్ష్యంగా పయనం
- ఇప్పటికే 9,300 హెక్టార్లకు పరికరాల మంజూరు



వేరుశనగలో డ్రిప్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్



మామిడి తోటకు డ్రిప్ మంజూరైనట్లు చెబుతున్న రైతు రసూల్‌బీ

అనంతపురం అగ్రికల్చర్: బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఉద్యాన పంటలకు వంద శాతం డ్రిప్ అందించాలనే ఆలోచనతో అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాయితీతో అందిస్తోంది. కొన్ని వ్యవసాయ పంటలకు కూడా వర్తింపజేస్తోంది. ఐదు ఎకరాల్లోపున్న రైతులకు 90 శాతం, ఆపైన ఉన్న వారికి 70 శాతంతో డ్రిప్ పరికరాలు ఇస్తుండగా... ఐదు ఎకరాల్లోపున్న వారికి 55 శాతం, ఆపైన 12.50 ఎకరాల వరకు ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు అందిస్తూ సూక్ష్మసాగును ప్రోత్సహిస్తోంది. సూక్ష్మ సాగు సేద్యంలో జిల్లా అగ్రస్థానంలో దూసుకుపోతోంది. ఈ ఏడాది జిల్లాలో రూ.130 కోట్ల వరకు వెచ్చించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

'అనంత'కే అత్యధిక కేటాయింపులు..

సూక్ష్మ సాగు సేద్యంలో రాష్ట్రంలోనే అత్యధిక కేటాయింపులు 12,500 హెక్టార్ల లక్ష్యం అనంతపురం జిల్లాకు ఇచ్చారు. ఇప్పటికే 9,300 హెక్టార్లకు సంబంధించి 7,700 మంది రైతులకు సూక్ష్మ సాగు పరికరాలు మంజూరు చేశారు. వీరిలో 5,676 మంది రైతులకు 6,962 హెక్టార్లకు సంబంధించిన పరికరాలు సరఫరా చేసి అమర్చారు. మంజూరు, ఇన్‌స్టలేషన్ అంశంలో అనంతపురం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. కాగా 25,443 మంది రైతులు 33,124 హెక్టార్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

- డ్రిప్, స్ప్రింక్లర్ల యూనిట్ల మంజూరులో 9,300 హెక్టార్లతో అనంతపురం జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతుండగా ఆ తర్వాత 8,50 హెక్టార్లతో ప్రకాశం, 7,350 హెక్టార్లతో వైఎస్సార్ కడప, 5,972 హెక్టార్లతో అన్నమయ్య, 5,497 హెక్టార్లతో సత్యసాయి జిల్లాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

గడువులోపు లక్ష్యం పూర్తి..

డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు మార్చి వరకు గడువు ఉన్నా... జనవరి నెలాఖరుకే లక్ష్యం పూర్తి చేయడానికి ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నాం. అయితే డిసెంబర్, జనవరి నెలల్లో జిల్లాలో అరటి పెద్ద ఎత్తున సాగులోకి రానుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున డ్రిప్ ఉన్న రైతులే అరటి సాగు చేస్తే మేలు. సకాలంలో రైతులకు డ్రిప్ పరికరాలు అందించి 'అనంత'ను అగ్రస్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తాం.

– జి.ఫిరోజ్‌ఖాన్, పీడీ, ఏపీఎంఐపీ

30 రోజుల్లోనే డ్రిప్

డ్రిప్ కోసం దరఖాస్తు చేసిన నెల రోజుల్లోపే జైన్ కంపెనీ నుంచి యూనిట్లు మంజూరయ్యాయి. వాటిని సకాలంలో పొలంలో బిగించుకోవడంతో 5 ఎకరాల మామిడి తోటకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పోయింది. 90 శాతం సబ్సిడీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సకాలంలో మంజూరు చేసిన ఏపీఎంఐపీ అధికారులకు ధన్యవాదాలు.

– రసూల్‌బీ, మహిళా రైతు, కామారుపల్లి, అనంతపురం రూరల్ మండలం

జనవాక్కు

గంటలోపే సర్టిఫికెట్



గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే యాడికికి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. అక్కడ అధికారులు లేరంటే ఆ రోజూ పనిచేటుతో పాటు డబ్బు కూడా నష్టమే. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి మా అవసరాలు అడిగి తీరుస్తున్నారు. మొన్నీమధ్య జగనన్న సురక్ష క్యాంప్ పెట్టి గంట లోపే మాకు అవసరమైన కుల ధ్రువీకరణతో పాటు ఇన్‌కం, అండగల్, వన్‌బీ పత్రాలను ఉచితంగా అందజేశారు. నిజంగా జగనన్న పాలన బాగుంది.

– లక్ష్మీదేవి, పుప్పాలతండా, యాడికి మండలం

పెట్టుబడి సాయంతో ఊరట



నాకు 2.50 ఎకరాల పొలం ఉంది. గతంలో పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి, నష్టపోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా పథకంతో పెట్టుబడి సాయం అందుతోంది. ఇది నాలాంటి సన్నకారు రైతులకు ఎంతో ఊరట కలిగిస్తోంది. సీఎం వైఎస్ జగన్ రైతుల పక్షపాతి అనేందుకు ఇదే నిదర్శనం.

– రైతు మల్లారి వెంకటేశులు, కంబదూరు

సొంతింటి కల నెరవేరింది



నేను ఆకుకూరల వ్యాపారం, నా భర్త పుల్లారావు కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. మాకిద్దరు పిల్లలు ఉన్నారు. అంతా కలసి ఓ చిన్నపాటి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. ఈ జన్మలో సొంతిల్లు కట్టుకోలేమని బాధపడేవాళ్లం. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించాక మా కుటుంబ పరిస్థితులు మారిపోయాయి. నేమతాబాద్ రోడ్డులో ఇంటి పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణం కూడా దాదాపు పూర్తయింది. త్వరలో సొంతింటికి వెళతాం. ఇదంతా సీఎం జగన్ చలువే. ఆయన చల్లగా ఉండాలి.

– గద్దం నాగలక్ష్మి, గుత్తి

రైతుల ఇంట సిరులు



నాకు 3 ఎకరాల భూమి ఉంది. ఇందులో 50 సెంట్ల భూమిని బీటీపీ కాలువ కోసం అధికారులు తీసుకున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి రూ.11.50 లక్షల పరిహారం అందింది. బీటీపీ పనులు పూర్తయితే రైతుల ఇంట సిరుల పంట పండుతోంది. గత టీడీపీ ప్రభుత్వం బీటీపీపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీటీపీ పనులు జోరుగా సాగుతున్నాయి.

– రైతు రామాంజినేయులు, ఒంటిమిద్ది, కళ్యాణదుర్గం మండలం

వాహన బీమా పేరుతో బురిడీ

అనంతపురం క్రైం: వాహనాలకు బీమా చేయాలంటూ డబ్బిస్తే నకిలీ పత్రాలు చేతిలో పెట్టి పంపాడు ఓ మోసగాడు. ఏడాది గడిచాక ఈ మోసం వెలుగు చూసింది. ఘటనపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. వివరాలు.. అనంతపురంలోని పాతూరుకు చెందిన భాస్కర్ ఏడాది క్రితం ఓ కారు కొనుగోలు చేశాడు. దీనికి బీమా చేయించాలంటూ అనంతపురంలోనే నివాసముంటున్న తాడిపత్రికి చెందిన ప్రైవేట్ బీమా కంపెనీ ఏజెంట్ హర్షను సంప్రదించాడు. రికార్డులు పరిశీలించిన అనంతరం బీమా ప్రీమియం రూ.7.500 చెల్లించాలని ఏజెంట్ హర్ష తెలపడంతో ఆ మేరకు నగదు చేతికి ఇచ్చాడు. ఆ తర్వాతి రోజు బీమా చేయించినట్లుగా కొన్ని పత్రాలను తీసుకెళ్లి భాస్కర్‌కు హర్ష అందజేశారు. ప్రస్తుతం బీమా కాల పరిమితి ముగియడంతో దానిని రెన్యూవల్ చేయించేందుకు సదరు కంపెనీ ప్రతినిధులను భాస్కర్ సంప్రదించాడు. రికార్డులు పరిశీలిస్తే అసలు ఆ కారుకు బీమా చేయలేదని తేలింది. నకిలీ పత్రాలు ఇచ్చి మోసం చేసినట్లుగా గుర్తించిన బాధితుడు శనివారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 23న అనంతపురంలోని నీలం సంజీవ రెడ్డి మైదానంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 9 గంటలకు మైదానానికి చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలి.

బీసీలను దగా చేసింది టీడీపీనే

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న హరీష్‌కుమార్ యాదవ్

అనంతపురం కార్పొరేషన్: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బీసీలను వాడుకుని అధికారం చేపట్టిన తర్వాత వారిని దగా చేసిన నీచ చరిత్ర టీడీపీ నాయకులదని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సామాజిక, రాజకీయ ప్రాధాన్యత దక్కిందంటే అది కేవలం జగన్ సర్కార్‌లోనే అని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండిస్తూ శనివారం అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను నమ్మించి మోసం చేసింది టీడీపీ వారేనన్న వాస్తవాన్ని కాలవ గుర్తించాలన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలు, నగరపాలక, మునిసిపాలిటీ తదితర ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం సీట్లను సీఎం వైఎస్ జగన్ కేటాయించి, తాను బీసీల పక్షపాతినని నిరూపించుకున్నారన్నారు. అంతేకాక నామినేటెడ్ పోస్టుల్లోనూ బీసీలకే సముచిత స్థానం కల్పించారన్నారు. బీసీలను రాజ్యసభకు పంపిన చరిత్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ అంశంపై దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని దిగజారుడు రాజకీయాలకు పాల్పడితే సహించబోమన్నారు.

రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహం

- రోడ్డు పక్కన పడేసి నిప్పంటించిన దుండగులు
- పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసులు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న రామగిరి సీఐ చిన్నగౌస్, కనగానపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 35 సంవత్సరాలున్న వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం రాత్రి అక్కడ పడేసి పెట్రోల్ పోసి నిప్పటించినట్లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు సైతం అక్కడకు చేరుకుని పరిశీలించారు. సగానికి పైగా శరీర భాగాలు కాలిపోయాయి. సమీప ప్రాంతాల్లో ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మరో ప్రాంతంలో హతమార్చి ఇక్కడ పడేసి నిప్పంటించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహంపై ఉన్న ఆనవాళ్లను బట్టి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామానికి చెందిన వివాహిత సుబ్బలక్ష్మి (42) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... భర్త కుమార్ మద్యానికి బానిసై పనీపాట లేకుండా తిరుగుతుండడంతో తాగుడు మానేయాలంటూ పలుమార్లు సుబ్బలక్ష్మి బతిమలాడింది. అయినా అతనిలో మార్పు రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం ఎందిన ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక్క శనివారం ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్లూరు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

పక్కాగా కులగణన



సర్వే తీరును వివరిస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ, పాల్గొన్న సంక్షేమ శాఖల అధికారులు

అనంతపురం అర్బన్: ఈ నెల 27వ తేదీ నుంచి జిల్లాలో చేపట్టనున్న కులగణన పక్కాగా జరగాలని అధికారులకు సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఓ ఓబుళమ్మ సూచించారు. కులగణన సర్వేపై శనివారం కలెక్టరేట్ నుంచి ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీఓలు, సహాయ సంక్షేమ అధికారులకు వర్చువల్ విధానంలో శిక్షణ నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహించాల్సిన తీరు, పాటించాల్సిన నిబంధనలపై సీపీఓ, డీఎల్‌డీఓ అవగాహన కల్పించారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అంశాలపై కులగణన చేపట్టాలన్నారు. ప్రతి కుటుంబాన్ని తప్పని సరిగా సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, గిరిజన సంక్షేమాధికారి అన్నాదొర, బీసీ సంక్షేమాధికారి కుష్బూకోఠారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

కూడేరు: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని హమాలీ నగర్‌కు చెందిన నవీన్ (35) పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కర్నూలు జిల్లా ఆదోని సమీపంలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి కుటుంబసభ్యులతో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అక్కడ మొక్కు చెల్లించి శుక్రవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నాగమ్మ, కుమారుడు మణికంఠకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. నవీన్ సోదరుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రదీప్‌రెడ్డికి ఐదు వికెట్లు

అనంతపురం: బీసీసీఐ ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా జరుగుతున్న అండర్–19 (మెన్) కుచ్‌బెహర్ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు బౌలర్ టి.ప్రదీప్‌రెడ్డి ఐదు వికెట్లు కూలదోశాడు. మల్టీడే మ్యాచ్‌లో భాగంగా తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు 428 భారీ స్కోరు చేసింది. 9వ వికెట్ భాగస్వామ్యానికి 93 పరుగులు వచ్చాయి. తమిళనాడు బ్యాటర్ షేర్షిక్ 126 పరుగులు, అక్షయ్ ఆర్. సారంగధర్ 91 చేశారు. చివరి భాగస్వామ్యంలోని సాయి కార్తీక్ 50, కేవిన్ రోమారియా 50 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్రా జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది.

21న ఉద్యోగ మేళా

అనంతపురం: హైదరాబాద్‌లోని ప్రముఖ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 21న అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తోంది. 2022, 2023లో ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన వారు అర్హులు. కంపెనీలో ఉద్యోగం చేస్తూనే డిగ్రీ పూర్తి చేసే అవకాశం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 91820 63878, 91548 29055లో సంప్రదించవచ్చు.

బెట్టింగ్‌లకు పాల్పడితే ఉపేక్షించం : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని ఎస్పీ అన్బురాజన్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2023 వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 70 బెట్టింగ్ యాప్‌లున్నట్లు గుర్తించామని, అలాగే బెట్టింగ్‌లతో సంబంధాలున్న 50 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. బెట్టింగ్ రాయుళ్లపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా 94407 96800కు సమాచారం అందించాలని కోరారు.

అనధికారిక ఎరువుల విక్రయాల నిలిపేత

విడపనకల్లు: స్థానిక సాయి సిద్దేశ్వర, వెంకటేశ్వర, దొడ్డ బసవేశ్వర గ్రోమోర్ ఎరువుల దుకాణాలను ఉరవకొండ డివిజన్ ఏడీఏ పద్మజ, విడపనకల్లు వ్యవసాయాధికారి పెన్నయ్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనధికారికంగా ఉన్న రూ.2,22,017 విలువ చేసే ఎరువులను గుర్తించి విక్రయాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదాములో కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు

తాడిపత్రి టౌన్: మండలంలోని చిన్నపోలమడ సమీపంలో ఉన్న చౌకధాన్యపు గోదాములో విజిలెన్స్, రెవెన్యూ అధికారుల తనిఖీలు శనివారమూ కొనసాగాయి. అక్కడి కాటాలు సక్రమంగా పనిచేయకపోవడంతో తనిఖీలు మందకొడిగా సాగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం సాంకేతిక నిపుణులు అక్కడకు చేరుకుని మరమ్మతులు చేయడంతో ఒత కాటాలు పనిచేయసాగాయి. మరో రెండు రోజుల పాటు తనిఖీలు కొనసాగే అవకాశమున్నట్లు విజిలెన్స్ సీఐ రామారావు తెలిపారు. ఎస్ఐలు శేషగిరి, జైపాల్, సీఎస్‌డీటీ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కలిసిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రైవేట్ స్కూల్స్ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీలకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి తదితరులు శనివారం కడపలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, రెన్యూవల్స్ ఆన్లైన్ విధానంలో కాకుండా పూర్వ పద్ధతిలోనే (ఆఫ్‌లైన్) దరఖాస్తు చేసుకునేలా కృషి చేశారని పుల్లారెడ్డి తెలిపారు. మూడేళ్ల గుర్తింపు పొందిన పాఠశాలల గుర్తింపును 8 ఏళ్లకు పొడిగించడంలోనూ, అదనపు సెక్షన్స్ విషయంలోనూ, ఓపెనింగ్ పర్మిషన్, చలానా విషయంలోను, ఫైల్స్ సబ్మిట్ చెయ్యడానికి గడువు పొడిగింపునకు ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, కల్పలత రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అనంతపురం జిల్లా నాయకులు నారాయణ రెడ్డి, వెంకటరామిరెడ్డి, వరదరాజులు, గుంతకల్లు నాయకులు శ్రీనాథ్ రెడ్డి, రంగేశ్వర్ రెడ్డి, కేశవ తదితరులు ఉన్నారు.

ఎస్కేయూ వీసీకి సన్మానం



వీసీ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి పదవీ కాలం ఈ నెల 24న ముగియనుంది. ఈ నేపథ్యంలో అంటియా (ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్), వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వీసీ దంపతులను శనివారం సన్మానించారు. మూడేళ్లలో వర్సిటీ పురోగతికి వీసీ విశేషంగా కృషి చేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అంటియా ప్రెసిడెంట్ వెంకటప్ప రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, అంటియా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే. మురళీ రెడ్డి, పూర్వ సైన్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. శంకర్ నాయక్, జేఎన్‌టీయూ అనంతపురం బోధనేతర సంఘం అధ్యక్షుడు జయకృష్ణ, సెక్రటరీ పుష్పలత, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, ఎస్కేయూ బోధనేతర సంఘం అధ్యక్షుడు ఎం. రాము, మాజీ ఉపాధ్యక్షుడు సి. నాగభూషణం సాకే గోవిందు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై ఆర్జేడీకి వైఎస్సార్‌టీఎఫ్ వినతి



ఆర్జేడీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలపై విద్యాశాఖ ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె. ఓబుళపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హెచ్. గిరిధర్ రెడ్డి విన్నవించారు. శనివారం వైఎస్ఆర్ కడప ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుల కార్యాలయంలో ఆర్జేడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం. వెంకట కృష్ణారెడ్డి మొదటిసారి మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లగా పదోన్నతులు కల్పించి, మోడల్ స్కూల్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేశారని ఓబుళపతి తెలిపారు. ఉపాధ్యాయులు సర్వీస్ మ్యాటర్ సమస్యలు, 3,4,5 తరగతులు మెర్జ్ అయిన హైస్కూళ్లకు అవసరమైన టీచర్లను వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా సర్దుబాటు చేసేలా చూడాలని ఆర్జేడీని కోరారు.

ఉత్సాహంగా ముగిసిన కల్చరల్ ఫెస్ట్



కల్చరల్ ఫెస్ట్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



బహుమతులు ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ శశిధర్ తదితరులు



విద్యార్థుల ఉత్సాహం

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఆడిటోరియంలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ ఉత్సాహంగా ముగిసింది. ఆటలు, పాటలు, నృత్యాలు, ఫుడ్‌కోర్టులు, హాస్య వల్లరిలో పాల్గొన్న విద్యార్థులు.. తమలోని నైపుణ్యాలను ప్రదర్శించారు. తొలిసారిగా నిర్వహించిన వేడుక కావడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వర్సిటీ పూర్వ విద్యార్థి, సినీ హీరోయిన్ గాయత్రి రాకతో మరింత సందడి నెలకొంది. రెండు రోజులుగా సాగిన ఈ వేడుక శనివారం సాయంత్రం అట్టహాసంగా ముగిసింది. జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాల, పులివెందుల, కలికిరి, ఓటీపీఆర్ఐ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ సి.శశిధర్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, కోఆర్డినేటర్ అంకారావు, డాక్టర్ అరుణను వీసీ డాక్టర్ జింకా రంగ జనార్దన అభినందించారు. కార్యక్రమంలో బోర్డ్ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ సీఈఓ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థినుల ప్రదర్శన



కేరింతలు కొడుతున్న విద్యార్థినులు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

దమ్మున్న ముఖ్యమంత్రి జగనన్న

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నాయకులు

కనగానపల్లి (రాప్తాడు): దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని, లబ్ధి పొంది ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి అంటూ ప్రజలను కోరుతున్న దమ్మున్న ప్రజానాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం రాప్తాడు మండలంలోని బండమీదపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించటంతో పాటు ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.40 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులకు భూమి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, రైతులు, దళితులు, మైనార్టీలు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు స్కామ్‌లు చేసి రూ. కోట్లు కాజేస్తే, సీఎం జగన్ స్కీమ్‌ల ద్వారా పేద ప్రజలకు రూ.కోట్లు అందిస్తున్నారన్నారు. రైతులకు సాగు నీరందించేందుకు కాలువలు, ప్రాజెక్టులు పనులు చేపట్టడంతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ఉచితంగా 3 వేల బోర్లు వేయిస్తున్నామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమ్మ డెయిరీని ప్రారంభించామన్నారు.

పల్లెల అభివృద్ధి పట్టని పరిటాల కుటుంబం: 25 ఏళ్లుగా ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసిన పరిటాల కుటుంబ సభ్యులు నియోజక వర్గంలో పల్లెల అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. బండమీదపల్లి ప్రధాన రహదారిని 40 ఏళ్లుగా ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోలేదన్నారు. సొంత నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఇలాంటి అభివృద్ధి పనులు చేపడుతున్నాం కాబట్టే ప్రజలు మమ్మల్ని 30వేల మెజార్టీతో గెలిపించి, తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలని భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు హేమావతి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, ఎంపీటీసీ రుక్మిణమ్మ, సర్పంచ్ ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పూజారి, ఆలయ కమిటీ సభ్యుడు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం బళ్లారిరోడ్డు ఓంనగర్‌లో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ట వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్టేట్, పాపంపేట, భాగ్యనగర్, ఆంజనేయనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు చేశారు. ఆలయక కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటలకు దేవతా యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, కలశప్రతిష్ట జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి హారతి, 12.30 గంటల నుంచి మహా అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ ఉమామహేశ్వర్, నరసింహారెడ్డి, చౌదరి, శ్రీనివాసులు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన ఆలయ స్థల సమస్య.. 40 ఏళ్ల కిందటే ఇక్కడ సాయి మందిరం ఏర్పడింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ తూర్పు వైపున 10 సెంట్ల స్థలం తీసుకున్నారు. అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించారు. అంతలో కరోనా రావడంతో దాదాపు రెండేళ్లకు పైగా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. దీంతో స్థల యజమాని ససేమిరా అన్నారు. ఇదే సమయంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసి విన్నవించారు. స్థల యజమానిని పిలిపించి మాట్లాడారు. ఎట్టకేలకు స్థలాన్ని ఆలయానికి రిజిస్ట్రేషన్ చేయించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

అనంతపురం కల్చరల్: లక్ష్మీనగర్ కోదండరామాలయంలో వివిధ దేవతామూర్తుల పునఃప్రతిష్ట కార్యక్రమాలు శనివారం శివపార్వతుల కల్యాణంతో ముగిశాయి. అయ్యప్ప, సుబ్రమణ్యేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్టతో పాటు శిఖర ప్రతిష్టను పండితులు జరిపించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, సురేష్, నాగార్జున, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం పాలక మండలి సభ్యుడు సురేష్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు గంగప్ప, వెంకటేశులు, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

ఆత్మకూరు: కార్తీక మాస మొదటి ఆదివారం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

స్టాఫ్‌నర్సులకు ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన స్టాఫ్‌నర్సులకు సర్టిఫికెట్లను అందించిన డీసీహెచ్ఎస్ రవికుమార్

అనంతపురం కార్పొరేషన్: ఏపీ ప్రభుత్వం, నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తల్లీబిడ్డ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నపిల్లల విభాగం, గైనిక్ స్టాఫ్‌నర్సులకు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, ముగింపు కార్యక్రమానికి డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తల్లీబిడ్డ సంరక్షణలో స్టాఫ్‌నర్సుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండే గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులకు పిల్లలకు అందించే పౌష్టికాహారం, తదితర సేవలపై అవగాహన ఉండదని, అలాంటి వారికి అవగాహన కల్పించడం ద్వారా తల్లీబిడ్డ సంరక్షణ సాధ్యపడుతుందన్నారు. గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులు ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ కావడంలో స్టాఫ్‌నర్సులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. రౌండ్ ద క్లాక్ సేవలందిస్తున్నారన్నారు. అనూరా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 150 మంది స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇచ్చారన్నారు. అనంతరం డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు స్టాఫ్‌నర్సులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ గ్రేడ్- 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, హెడ్‌నర్సులు సైరాబాను, ఆర్‌బీ పద్మ, భూదేవి, స్టాఫ్‌నర్సులు సునీత, శోభ, నీలిమ, కీర్తి, పెద్దక్క, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రణాళిక పక్కాగా ఉండాలి



బడిబాట పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులందరికీ ఉపయోపడేలా బడ్జెట్ ప్రణాళిక పక్కాగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పేర్కొన్నారు. 2024–25, 2025–26 సంవత్సరాలకు సమగ్ర శిక్ష వార్షిక బడ్జెట్‌కు సంబంధించిన ప్లాన్‌పై మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్ఎంపీలు, అకౌంటెంట్లకు శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాపునకు డీఈఓ, ఏపీసీ హాజరై మాట్లాడారు. వారంలోపు మండలస్థాయి ప్రణాళికలు సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపాలన్నారు. సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఐఈడీ కోఆర్డినేటర్ షమా, అలెస్కో గోవిందరెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్ఎంలో పలు వినతులు

అనంతపురం సెంట్రల్: సార్.. మా ఊరికి బస్సు రాలేదని ఒకరు..బస్సు పాసులు మంజూరు చేయాలని మరొకరు.. బస్సు పునరుద్ధరించాలని ఇంకొరు ఇలా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనికి విన్నవించారు. అనంతపురంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని నిర్వహించారు. మొత్తం ఏడు ఫోన్ కాల్స్ వచ్చాయి. వినతులు ఇవీ.. మానసిక వికలాంగులకు బస్సు పాసు ఇవ్వాలని ధర్మవరానికి చెందిన సంతోష్‌కుమార్ కోరగా, గుల్బార్గాకు బస్సు నడపాలని అనంతపురానికి చెందిన జేసీ కుళ్లాయప్ప కోరారు. గోళ్ల మీదుగా బెలుగుప్పకు రంగయనాయకులు అనే వ్యక్తి కోరాడు.పెనకచెర్ల మీదుగా కొత్తపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని అనిల్‌కుమార్ అనే వ్యక్తి కోరారు.బండమీదపల్లి నుంచి శివ ప్రసాద్ అనంతపురం నుంచి వరిమడుగు మీదుగా బండమీదపల్లికి బస్సు నడపాలని శివప్రసాద్ అనే వ్యక్తి కోరాడు. నార్పల మీదుగా ఎల్లుట్లకు బస్సు పునఃరుద్ధరించమని ప్రతాప్, హేమలత కోరారు.

సహాయం పేరిట మహిళ వేధింపులు!

- పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

అనంతపురం క్రైం: సహాయం కోసం మాటలు కలిపిన ఓ మహిళ వేళాపాళా లేకుండా ఫోన్‌చేస్తూ వేధిస్తోందని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ రెడ్డెప్పను కలిసి తన గోడు వెల్లబోసుకున్నాడు. తనకు ఓ మహిళ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, అందరిలాగే తనకూ సహాయం చేయాలంటూ విజ్ఞప్తి చేసిందని తెలిపాడు. అంతటితో ఆగక ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్ చేసి చనువు తీసుకుని 'నిన్నేమని పిలవను'అంటూ విసిగిస్తోందని పేర్కొన్నాడు. మాటలు కలిపి.. ఇరకాటంలో పెట్టడానికి ప్రయత్నిస్తోందని, తనకు న్యాయం చేయాలని కోరాడు. సీఐ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ సదరు మహిళకు ఫోన్ చేసి ఆరా తీయగా... 'అతను నాకు సహాయం చేయకుండా పొమ్మను.. కథ చెబుతా' అంటూ బెదిరింపు ధోరణిలో సమాధానమిచ్చింది. కేసు కాకపోతే ఇంకేమైనా పెట్టుకోండని ఫోన్ కట్ చేసింది. ఆ మహిళ ప్రమాదకారి అని, చాలామందిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిందని బాధిత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సీఐ ఎదుట వాపోయాడు. ఆమె వెనుక మైనార్టీ వర్గానికి చెందిన ఇద్దరు పెద్ద మనుషులు ఉన్నారని, వారి ప్రోద్బలంతోనే ఇదంతా చేస్తోందని ఆరోపించారు. 'ఆ పెద్ద మనుషులు'ను పిలిపించి విచారించిన తర్వాత చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పి ఫిర్యాదుదారుడిని పంపించారు.

ఓటరుగా నమోదు చేయించాలి

ఆత్మకూరు: అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయించాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, మండల ఎలక్షన్ ఇన్‌చార్జ్ ననప గోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు, ప్రజా ప్రతినిధులకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఓటర్ల జాబితాకు సంబంధించి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని పార్టీలవారు అనర్హులను, డబుల్ ఓటర్లుగాను ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, నాయకులు ఫణిరెడ్డి, నాగరాజు, నరసింహులు, పోతన్న, కృష్ణానాయక్, మహేష్, ఎర్రిస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆరిపోయే దీపం కోసం సునీతమ్మ ఆరాటం

- బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ

రాప్తాడురూరల్: తెలుగుదేశం పార్టీ ఆరిపోయే దీపం లాంటిదని, అలాంటి పార్టీ కోసం మాజీ మంత్రి పరిటాల సునీత ఆరాటపడుతోందని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పోల్చడం అంటే ఆ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగినట్లు పరిటాల సునీత అంగీకరించినట్లేనని అన్నారు. చదువు రాని సునీతమ్మ కూడా సైకో అంటోందని, 'సైకో' కు స్పెల్లింగ్, అర్థం సునీతమ్మకు తెలుసా? అని ప్రశ్నించారు. ఒకసారి ఎమ్మెల్యేను చేసిన ఫలితంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నిరంతరం ప్రజలకు కాపలాదారుడిలా పని చేస్తున్నారన్నారు. ఏ కుటుంబంలో ఎవరు చనిపోయినా ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తున్న ఏకైక వ్యక్తి ప్రకాష్ రెడ్డి అనేది మీకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. ప్రజల రక్తమాంసాలను భుజించిన మీరెక్కడ? ప్రజలే ధ్యాస, శ్వాసగా పనిచేస్తున్న ప్రకాష్‌రెడ్డి ఎక్కడ? అని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో అతి చిన్న వయస్కుడిగా, గొప్ప ఆలోచనలు కలిగిన వాడిగా అనతి కాలంలోనే పేరు తెచ్చుకొని, రాష్ట్రంలో ఏ ప్రాంతంలో, ఏ రకమైన ఎన్నికలు జరిగినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నమ్మకస్తుడిగా ప్రకాష్‌ను ఆ ప్రాంత బాధ్యతలను ఇవ్వడం బట్టి ఆయన శక్తి ఏమిటో తెలుస్తుందన్నారు. మీ కంఠ శోషలకు, మీ పిల్లి శాపాలకు ఎవరు కనికరించరు అని అన్నారు. మీరు నిత్యం అసత్యాల ప్రచారం తప్ప, ఎక్కడైనా సామాన్య మానవుడికి సాయం చేసిన దాఖలాలు చూపించగలరా? అన్నారు. చరిత్రలో కనివినీ ఎరుగని విధంగా ఏ నాయకుడు, ఏ పార్టీ చెప్పని విధంగా, జగన్ ప్రజలకు మేలు చేసి ఉంటే నా పార్టీకి ఓటేయండి, అని పబ్లిక్‌లో చెప్పగలిగిన సన్నివేశం ఎక్కడైనా చూశారా? ఆ దమ్ము ధైర్యం మీ పార్టీకి, మీకు ఉందా? క్రికెట్ ప్రపంచ కప్ లో ఇండియా టీంలా రాప్తాడు నియోజకవర్గంలో దూసుకుపోతున్న ప్రకాష్ రెడ్డిని ఓడించడం మీ తరమా? అని అడిగారు.

టీమిండియాకు శుభాకాంక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని మోక్షిత్ స్కూల్ విద్యార్థులు ఆదివారం జరగనున్న ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి , స్కూల్ హెచ్ఎం వై. లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

ఆత్మకూరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో గ్రంథాలయ అధికారి నల్లమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వపు పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గురురాజ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేలు పరిహారమివ్వాలి

అనంతపురం అర్బన్: తీవ్ర వర్షాభావంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున 10 ఎకరాల వరకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని రైతు సంఘం జిల్లా కమిటీ కోరింది. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించింది. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ

సంక్షిప్త సమాచారం

సభ్యులు పోతులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మిదేవి, సువర్ణమ్మ, చిదంబరమ్మ, పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో 118వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఎం లారెన్స్, డివిజినల్ మేనేజర్ వెంకటరామ్ ప్రసాదరెడ్డి, డీఎం ఈరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 118 మంది లబ్ధిదారులకు రిటైల్ లోన్స్ మంజూరు పత్రాలు అందజేశారు.

గుడికట్ల సంబరాలు విజయవంతం చేయండి

అనంతపురం టవర్ క్లాక్: కురుబల గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు తుప్పటి ఈశ్వరయ్య కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో జూనియర్ కళాశాల మైదానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న కురుబల గుడికట్ల సంబరాలు నిర్వహిస్తున్నమన్నారు. ఉదయం ఇంటెల్ కాలేజ్ దగ్గర నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 250 దేవుళ్ల ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ర్యాలీ జూనియర్ కళాశాల చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

యూజర్ చార్జీలు వసూలు చేయండి

అనంతపురం కార్పొరేషన్: క్లాప్ ఆటోల నిర్వహణకు సంబంధించి యూజర్ చార్జీలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సిబ్బందిని నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో మెప్మా సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. యూజర్ చార్జీల జాప్యంపై సంబంధిత సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెప్మా సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, సత్యమూర్తి, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్‌హెచ్ఎస్- 6 పై గ్రామాల్లో సర్వే

కనగానపల్లి (రాప్తాడు): రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ కుటుంబ ఆరోగ్య- 6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్- 6) అధికారులు సర్వే నిర్వహించారు. శనివారం మండలంలోని ఎం. బండమీదపల్లి గ్రామంలో ప్రాజెక్టు టీం సభ్యులు పర్యటించి, 300 గృహాల్లో సర్వే చేశారు. ఈ వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు, రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆరోగ్యసేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ టీఎం సభ్యులు ఎస్ఎండీ షఫీ, హెచ్ఈటీ మోహన్, శివ, గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలో 38వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. స్థానిక ప్రజలతో మమేకమై ఏమైనా సమస్యలున్నాయా అని ఆరాతీశారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి, ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. రోడ్లు, కాలువల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, టెండర్లు ఆహ్వానించాలని ఈఈ సూర్యనారాయణ, ఏఈ శంకర్‌లను మేయర్ ఆదేశించారు. కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా పాల్గొన్నారు.